నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. టూరిస్ట్ హోటల్, ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ల పరిధిలోని టూరిస్ట్ హోటల్, చెప్పల్‌బజార్, కాచిగూడ మెయిన్ రోడ్డు, గౌరమ్మగల్లీ, రాజీవ్‌గాంధీ కమ్యూనిటీహాల్, సాయిబాబా కమాన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు... విద్యానగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్ గుండు, అడిక్‌మెట్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 3.30 వరకు... బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్, లలితానగర్, జమిస్తాన్‌పూర్ సాయంత్రం 4గంటల నుంచి 4.30 వరకు... బర్కత్‌పుర ఫీడర్ పరిధిలోని పద్మాకాలనీ, శంకర్‌మట్, కూరగాయాల మార్కెట్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4.30 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విరిగిన చెట్ల కొమ్మల తొలగింపు

అంబర్‌పేట: కురిసిన వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. గురువారం రాత్రి భారీ వర్షం పడడంతో బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలో పలు చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బంది అక్కడకు చేరుకుని వాటిని తొలగించారు.

టీఈఎంఎంటీప
నూతన కార్యవర్గం ఎన్నిక

కాచిగూడ: తెలంగాణ ఎలక్ట్రిక్ మెటీరియల్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ (టీఈఎంఎంటీప) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం కాచిగూడలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగన్ నాగుల, ప్రధాన కార్యదర్శిగా డి.మురళి, ఉపాధ్యక్షులుగా ఉస్మాన్ షేక్, వేణు గుండేటి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎక్కాల భిక్షపతి, కోశాధికారిగా కటకం వాసు, గౌరవ అధ్యక్షుడిగా ఎక్కాల నందు, అడ్వైజర్లుగా కిషోర్ గుప్తా, విశ్వేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గాన్ని రానున్న రెండు సంవత్సరాలకు ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు నాగుల జగన్ తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

చిక్కడపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎందరో ఉన్నతస్థాయికి ఎదిగారని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాన్ని ఆమె ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. వారు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు మేడే దేవదాస్, ఉపాధ్యాయులు నేతలు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 20 శాతం బస్‌పాస్ చార్జీల పెంపు అశాస్త్రీయమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకుడు విజయ్ మల్లంగి అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్, బస్ భవన్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు వివక్షతతో కూడుకున్నవని అన్నారు. మహిళలకు బస్సు ప్రయాణాన్ని ఉచితం చేసి పురుషులకు బస్సు చార్జీలు రెట్టింపు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు టి.రాకేష్‌సింగ్, సుధారాణి, డాక్టర్ లక్ష్మనాయుడు, బాబులాల్ పవార్, రాకేష్‌రెడ్డి, ఆఫసలాం, జావీద్ షరీఫ్, ఎండీ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన విభావరి

చిక్కడపల్లి: రాగ మాధురి మ్యూజిక్ అకాడమీ, రసనాథ క్రియేషన్స్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన గాన విభావరి అలరించింది. గాయనీ గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న ఏకగళ, యుగళ గీతాలను మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా గాయకుడు వినోద్‌బాబును సంస్థ అధ్యక్షుడు ఏపీ పుల్లారావు సన్మానించారు. త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు నిర్మలాకామేష్, సురేఖామూర్తి, యశోద, వినోద్‌బాబు, శ్రీనివాసులు, కె.శ్రీనివాస్, జీఎస్ చత్రపతి, హేమంత్‌కుమార్, తులసీరాం పాల్గొన్నారు.

గద్దర్ అవార్డులను నిలిపేయాలని కోర్టును ఆశ్రయించాం

చిక్కడపల్లి: తెలంగాణ సినిమా వేదిక నాయకులు శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్‌రాంరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ లారా, కో కన్వీనర్ మోహన్ మాట్లాడారు. గద్దర్ అవార్డులను నిలిపేయాలని హైకోర్టును ఆశ్రయించామన్నారు. పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు విచారణకు ఆదేశించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం నైతికత ఉంటే విచారణ పూర్తయ్యే దాకా గద్దర్ అవార్డుల కార్యక్రమాన్ని ఆపాలన్నారు. ప్రభుత్వం ఆంధ్ర సినిమాలకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ఉందని అన్నారు. తెలంగాణ సినిమా రంగానికి తెలంగాణ ప్రభుత్వమే అన్యాయానికి ఒడిగట్టిందని మండిపడ్డారు.

అంబేడ్కర్ కళాశాల చౌరస్తాలో అధ్వానంగా ఉన్న రోడ్డు



కైలెవెన్ బేకరి సమీపంలో..



బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా టెంపుల్ చౌరస్తాలో..



రహదారులు ఛిద్రం..
రాకపోకలకు నరకం

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని బాగ్ లింగంపల్లిలోని పలు ప్రాంతాల్లోని రోడ్లన్ని ఛిద్రమై అధ్వానంగా మారాయి. చిక్కడపల్లి, పాలమూరు బస్తీ, బాగ్‌లింగంపల్లి, అచ్చయ్య నగర్, సూర్యనగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లోని రోడ్లన్నీ ఇటీవల కురిసిన చిన్న వర్షానికి గుంతలమయంగా మారాయి. వీఎస్‌టీ నుంచి అచ్చయ్యనగర్‌కు వెళ్లే దారి అంబేడ్కర్ కళాశాల ఎదురుగా, బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయం తదితర ప్రాంతాల్లో రహదారులు ఎక్కడికక్కడ కంకర తేలి గుంతలతో దర్శనమిస్తున్నాయి. కాంట్రాక్టర్లు నాసిరకమైన రోడ్లు వేయడం వలనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, నాయకుల పర్యవేక్షణ లోపం వలనే ఇలాంటి పరిస్థితి నెలకొంటుందని విమర్శిస్తున్నారు.

రాకపోకలకు అవస్థలు...

రోడ్లన్ని గుంతలమయ్యం కావడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు అక్కడి నుంచి పోవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. పాదచారులకు కూడా ఆయా ప్రాంతాల నుంచి నడవాలంటే ఒకింత ఇబ్బందులకు గురవుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లే సమయంలో గుంతల్లోని నీళ్లు పాదచారులపై పడుతున్నాయని చెబుతున్నారు. ఈ పరిస్థితి కొన్ని నెలలుగా కొనసాగుతున్నప్పటికి మరమ్మతులు చేయించకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చినందున అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు వెంటనే చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ వద్ద గుంతలమయంగా రోడ్డు

రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి



బాగ్‌లింగంపల్లిలోని పలు ప్రాంతాల్లో రోడ్లన్ని చాలా అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసిన గుంతలమయంగా తయారైంది. రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. వాహనాల ద్వారా నీళ్లు చిమ్మి పాదచారులపై పడినప్పుడు మమ్మల్ని ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు.

– ఎస్.రమేష్‌రెడ్డి, వాహనదారుడు

మరమ్మతులు చేయించాలి



వర్షాకాలం వచ్చినందున రోడ్ల మరమ్మతులు వెంటనే చేయించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి. ఆరు నెలల నుంచి అక్కడకక్కడ ఇదే పరిస్థితి ఉంది. అయితే అధికారులు ఎందుకు స్పందించటంలేదో అర్థం కావడం లేదు. కనీసం పెంచ్ వర్క్‌లైన పూర్తి చేయాలి.

– శంకర్, స్థానికుడు

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సత్యవతి ప్రసన్న, డా.నీలిమ

కాచిగూడ: ప్రతి మహిళా స్వయం కృషితో ఆర్థిక ప్రగతి సాధించాలని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈనెల 27వ తేదీన నగరంలోని నోవోటెల్‌లో జరగనున్న డైనమిక్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఉమెన్ ఇన్నోవేటర్స్ (దేవి) సంస్థ ఆవిర్భావ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావలని సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవి గౌరవ చైర్‌పర్సన్ సత్యవతి ప్రసన్న, చైర్‌పర్సన్ డా.నీలిమ, వైస్‌చైర్మన్ డా.కల్యాణి, చీఫ్ అడ్వైజర్ రాజు, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను కోసం ఇచ్చిన చెక్కులు బౌన్స్



ఆస్తిపన్ను చెల్లించని దుకాణాన్ని సీజ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 అధికారులు

ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు

అంబర్‌పేట: ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సర్కిల్ పరిధిలో హిమాయత్‌నగర్, కాచిగూడ, అంబర్‌పేట పరిధిలో పలు వ్యాపార సంస్థల వారు ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించని వారిని గుర్తించి వారి వ్యాపార సముదాయాలను సీజ్ చేస్తున్నారు. అందులో భాగంగా డీఎంసీ మారుతీదివాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలో ఓ వ్యాపార సంస్థను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ... కొన్ని నెలల క్రితం ఆస్తిపన్నులో వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశం కల్పించడంతో కొందరు చెక్కుల రూపంలో చెల్లింపు చేశారన్నారు. అందులో కొన్ని చెక్కులు బౌన్స్ అయ్యాయని తెలిపారు.

◆ 90 శాతం రాయితీని వినియోగించుకుని మిగిలిన డబ్బుల కోసం ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడం దారుణమని అన్నారు. మూడు రోజులుగా 6 వ్యాపార సముదాయాలను సీజ్ చెసినట్లు ఆయన వెల్లడించారు. ఆస్తి చెల్లింపులో ఆస్తి పన్ను చెల్లింపు దారులు పారదర్శకత పాటించాలని ఆయన కోరారు. అలాగే మొండి బకాయిల పట్ల తాము చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు.ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని డీఎంసీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ రవీందర్, సూపరింటెండెంట్ శివకుమార్ ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

శ్రీరమణ థియేటర్ యాజమాని ఈశ్వర్‌రెడ్డి మృతి



అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గానికి ల్యాండ్ మార్క్‌గా మారిన శ్రీరమణ థియేటర్ యాజమని జిన్నారం ఈశ్వర్‌రెడ్డి(92) అనారోగ్యంతో శుక్రవారం ఆయన నివాసంలో తుదిశ్వాస విడించారు. దాదాపు 45 ఏళ్ల క్రితం అంబర్‌పేటలో శ్రీరమణ థియేటర్ పేరిట రెండు థియేటర్లను ఆయన నిర్మించి ప్రజలకు వినోదాన్ని చేరువ చేశారు. ఆయన మరణం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు.

9 కిలోల గంజాయి పట్టివేత

ముషీరాబాద్: గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... రాజేష్(21), దినేష్‌రెడ్డి(25) కొంత కాలంగా అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి రహస్యంగా విక్రయిస్తున్నారని అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముషీరాబాద్ పార్సిగుట్ట చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా (ఏపీ39ఎల్‌వీ0188) హ్యూండాయ్ కారులో రాజేష్, దినేష్ రెడ్డి వస్తున్నారు. వారి కారును ఆపి తనిఖీ చేయగా అందులో నల్లటి చారల బ్యాగులో తొమ్మిది కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే వారిని అరెస్టు చేశారు. వారి నుంచి కారును, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేశారు.

బాలుడిని చేరదీసిన పోలీసులు



సూర్య (3)

కాచిగూడ: అనుమానాస్పదంగా సూర్య (3) కాచిగూడ ప్రభుత్వ హైస్కూల్ రోడ్డులో శుక్రవారం ఎడుస్తూ కనిపించాడు. కాచిగూడ పోలీసులు స్పందించి ఆ బాలుడిని చేరదీశారు. ఆ బాలుడిని చైల్డ్ హోమ్‌కు తరలించినట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ తల్లోజు జ్యోత్స్న తెలిపారు. బాలుడిని గుర్తిస్తే ఫోన్ నం. 8712660540, 8712661261లో సమాచారం ఇవ్వాలన్నారు.

స్నేహితుడిపై దాడికి పాల్పడిన యువకుడి రిమాండ్

కాచిగూడ: మద్యం మత్తులో స్నేహితుడిపై దాడికి పాల్పడిన యువకుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆశీష్ సహాని (25) కాచిగూడ నింబోలిఅడ్డ ఉంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. అతని మిత్రుడు సంజయ్ సహాని చెప్పల్‌బజార్‌లో ఉంటున్నాడు. ఇటీవల ఆశీష్ సహాని మద్యం మత్తులో సంజయ్ సహానిపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆశీష్ సహానిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

నల్లకుంట: పర్యావరణాన్ని మనం కాపాడితే పర్యావరణం మనలను బతికిస్తుందని పర్యావరణాన్ని పరిరక్షించడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని బీజేపీ హైదారాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నల్లకుంటలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన గౌతంరావు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నాయకులు కేజే బాబు, ఎంటీ కిషోర్‌కుమార్, కె.లక్ష్మణ్‌కుమార్, ప్రశాంత్ జోషి, మల్లికార్జున్, ఎస్.రామ్‌జగదీష్, శ్యామ్‌రాజ్, మురళీయాదవ్, మంగి శివ, మధుయాదవ్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బీజేపీ నేత డా. ఎన్.గౌతంరావు, కార్పొరేటర్ అమృత

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచాలి



అంబేడ్కర్ కళాశాలలో జరిగిన సెమినార్‌లో ప్రొ.లక్ష్మీపతిరావు, ప్రొ. లింబాద్రి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించి వారిని ఉపాధివైపు ప్రోత్సహించాలని ప్రొ.లక్ష్మీపతిరావు అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో యూజీ, పీజీ కోర్సుల పాఠ్య ప్రణాళిక తదితర అంశాలపై ఐదు రోజులపాటు జరిగిన వర్క్‌షాపు ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఎల్‌వీ కమల మాట్లాడుతూ... అటానమస్ కళాశాలలో పాఠ్య ప్రణాళిక ఏ విధంగా ఉండాలో వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్ణయించిన పాఠ్యప్రణాళికను అనుసరిస్తునే 30శాతం వరకు కళాశాల విద్యార్థుల అవసరాలకు తగిన విధంగా మార్పులు చేర్పులు చేసే అవకాశం అటానమస్ కళాశాలకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సీమా ఘోష్, అడిషనల్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ ఎంవీఎస్ మహేందర్, కళాశాల సీఈఓ ప్రొ.లింబాద్రి, ప్రొ. యాదగిరి, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపల్ డా.మట్టా శేఖర్, వేమనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ రావు సేవలు చిరస్మరణీయం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ: హరాస్‌పెంటలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి అధ్యక్షులుగా స్వర్గీయ ఎస్.గోపాల్ రావు అందించిన సేవలు చిరస్మరణీయమని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. గోపాల్‌రావు జయంతి సందర్భంగా శుక్రవారం కార్యక్రమంలో గోపాల్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోపాల్‌రావు ఆశయాల సాధనకు ప్రస్తుత ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో బ్యూటీషియన్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే టైలరింగ్, బోటిక్, యోగా, ఫిజియోథెరపీ, హెల్త్ క్లినిక్‌లను పేదల కోసం ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ విగ్, సాయి గిరిధర్, కృష్ణాగౌడ్, సి.నందగోపాల్, విజయ్‌కుమార్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

థియేటర్ వర్క్‌షాప్ సాంస్కృతిక అభివృద్ధికి నాంది



కవాడిగూడ: కవాడిగూడలోని ఆర్యన్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విద్యార్థులకు ప్రత్యేక థియేటర్ వర్క్‌షాప్ నిర్వహించారు. శుక్రవారం వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా అకాడమీ వ్యవస్థాపకుడు ఎస్పీ ఠాకూర్ మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌లో 8 నుంచి 18 ఏళ్ల ఉన్న విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారికి నాటక రంగంలోని ప్రాథమిక అంశాలు, పాత్రధారణ, అభినయం, సెట్స్ డిజైన్, ఆహార్యం మెదలైన రంగాలలో శిక్షణ ఇచ్చామన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, సృజనాత్మకత, టీమ్ వర్క్ అలవడుతుందని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, మానసిక, సామాజిక నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పాటు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలు భవిష్యత్ తరానికి సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి నాంది పలుకుతాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల కోసం పూర్తి సహకారం అందించిన భాషా సాంస్కృతిక శాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్యన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ అధితి నాగ్, ట్రైనర్ నవీన్ చెరుకు, అమితేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట: ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రేమ్‌నగర్‌లో రూ.4 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులన స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నియోజకవర్గంలో దశల వారీగా పైపులైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రోడ్ల, పార్కులు, వీధిలైట్లు, కమ్యూనిటీహాళ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో పాటు అధికారులు డీజీఎం విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

రూపాయి ఖర్చు లేకుండా పీజీ వరకు చదువుకోవచ్చు: ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్: విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల 'బడికి పోదాం.. చదువుకుందాం'అనే సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చదువుకోవచ్చని అన్నారు. వాటిని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు తమ పిల్లలను చదివించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. నేడు విద్యకు ఉన్న విలువ దేనికి లేదని... అది ఉంటే అన్ని సాధించుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు ఐఏఎస్,ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని అప్పుడే సమాజం దేశాభివృద్ధి సాధ్యమన్నారు.

◆ రాష్ట్రవ్యాప్తంగా 1050 బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వాటిలో 8 లక్షల మంది విద్యార్థులకు ఉచిత భోజనం, విద్యా సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. రూపాయి ఖర్చు లేకుండా 3వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. వాటిని బలహీన వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు గుజ్జ సత్యం, రాష్ట్ర నాయకులు వేముల రామకృష్ణ, సి.రాజేందర్, పగిల్ల సతీష్, కృష్ణుడు, ప్రజాపతి, భాస్కర్, రవియాదవ్, నరేష్‌గౌడ్, శివయాదవ్, లింగంముదిరాజ్, బాలయ్య, సంజీవరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పీటీసీ ప్రిన్సిపల్ మధుకర్‌స్వామి



రక్తదానం ప్రాణదానంతో సమానం

అంబర్‌పేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని అంబర్‌పేట పోలీసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ పరవస్తు మధుకర్‌స్వామి తెలిపారు. శుక్రవారం శిక్షణ కేంద్రంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. రక్త నిల్వలు ఎంతో క్షతగాత్రలను ప్రాణాపాయం నుంచి బయటపడేస్తాయని ఆయన వెల్లడించారు. పోలీసు విధులు అనేక సవాళ్లతో కూడకున్నవని, అన్నింటికి సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు.